
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక



ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 196 | శనివారం 21 నవంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-



ఎమ్మెల్యేలూ జాగ్రత్త..

మిమ్మల్ని ప్రజలు తిరస్కరించారు!

-- టీడీపీ ఎమ్మెల్యేల పనితీరుపై సీఎం చంద్రబాబు

(అంకుశం, అమరావతి, నవంబర్ 21):

కొందరు ఎమ్మెల్యేలను ప్రజలు తిరస్కరించారని సొంత పార్టీకి చెందిన వారిపై సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడిన సీఎం చంద్రబాబు స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై సమీక్షిస్తూనే, సొంత పార్టీ ఎమ్మెల్యేలకు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. ఈ ఎన్నికల ఫలితాలు కొందరు ఎమ్మెల్యేలకు మేలుకొలుపు కావాలి. కొందరి పనితీరును ప్రజలు ఆమోదించలేదని భావించాలన్నారు. ప్రతి ఫలితాన్నీ విశ్లేషించి ఆ మేరకు నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో కూటమికి 90 శాతం పైగా స్ట్రైక్ రేట్ వచ్చింది. 2024 అసెంబ్లీ ఎన్నికల కంటే స్థానిక ఎన్నికల్లో కూటమికి ఓటింగ్ శాతం పెరిగిందని, వైసీపీ ఓటింగ్ శాతం తగ్గిందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమికి ప్రజలు బ్రహ్మరథం పట్టినా, కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేల వ్యవహారశైలి, ప్రజలకు అందుబాటులో లేకపోవడం వల్లే ఓటర్లు అసంతృప్తి వ్యక్తం చేశారని చంద్రబాబు వెల్లడించారు. ప్రజల విశ్వాసం కోల్పోతే ఎంతటి వారైనా మూల్యం చెల్లించక తప్పదు.

నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలి అని హితవు పలికారు. పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులు గెలిచేలా నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సూచించారు.

వైభవంగా శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించిన టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర



అంకుశం న్యూస్ తిరుపతి సవంబర్ 21

తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలను డిసెంబరు 6 నుంచి 14వ తేదీ వరకు అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర తెలిపారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి భవనంలో శనివారం బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను ఈవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల తరహాలో అమ్మవారి బ్రహ్మోత్సవాలను కూడా అత్యంత ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ముందస్తు కార్యక్రమాలు

డిసెంబరు 1న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, డిసెంబరు 5న లక్షకుంకుమార్చన, అంకురార్పణ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముఖ్యమైన వాహనసేవలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా డిసెంబరు 6న ధ్వజారోహణం, 10న గజవాహనం, 11న స్వర్ణరథం, గరుడ వాహనం, 13న రథోత్సవం, 14న పంచమితీర్థం, 15న పుష్పయాగం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహనసేవలు జరుగుతాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకుని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఈవో కోరారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవోలు డాక్టర్ ఏ. శరత్, ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో మురళీకృష్ణ, సీఈ మనోహరం, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, వీజీవో గిరిధర, డిప్యూటీ ఈవోలు శ్రీమతి వి.ఆర్. శాంతి, గోవిందరాజులు, శ్రీ సెల్వం, సిఎంవో డాక్టర్ కుసుమ కుమారి, అదనపు ఆరోగ్య అధికారి డాక్టర్ సునీల్ కుమార్, ఆలయ అర్చకులు శ్రీ బాబు స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి


(అంకుశం, అమరావతి, నవంబర్ 21):

పెళ్లి సందడి తర్వాత, తిరుమల దర్శనం చేసుకుని సంతోషంగా తిరిగి వస్తున్న ఓ కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం ఛిన్నాభిన్నం చేసింది. ఒంగోలు సమీపంలోని పెళ్లూరు వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన ఘోర కారు ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. నూతన వధూవరులు శ్రీతేజ, కౌవల్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తిరుపతి నుంచి బాపట్లకు వస్తుండగా ప్రమాదం జరిగింది. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టు గోడను బలంగా ఢీకొట్టింది. ఆ ధాటికి కారు పక్కనే ఉన్న ఖాళీ కాలువలో బోల్తా పడింది. ప్రమాద ధాటికి కారు నుజ్జునుజ్జు అయింది.



ప్రమాదంలో ఒంగోలుకు చెందిన కారు డ్రైవర్ ప్రవీణ్ (29), బాపట్లకు చెందిన వరుడు శ్రీతేజ తల్లిదండ్రులు వెంకట్రావు (54), సుజాత (50), మరో మహిళ సీతామహాలక్ష్మి (47) మృతి చెందారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, నారా లోకేష్, హోం మంత్రి వంగలపూడి అనిత, మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

పుట్టపర్తిలో బాబా 101వ జయంతి వేడుకలు



ఘనంగా “దివ్య నామ స్మరణ” ప్రారంభం

సాయి నామస్మరణతో మారుమోగిన పుట్టపర్తి పురవీధుల

దివ్య నామ స్మరణను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



అంకుశం ప్రతినిధిపుట్టపర్తి, నవంబర్ 21:


భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి 101వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పుట్టపర్తి పట్టణంలో శనివారం “దివ్య నామ స్మరణ కార్యక్రమం” అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా ప్రారంభమైంది. శనివారం ఉదయం కలెక్టరే ట్ఎదురుగా మహిళా పోలీస్ స్టేషన్ అవరణంలో ఈ కార్యక్రమాన్ని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ - మిగతా2లో

ప్రపంచలోనే తొలి క్వాంటం, ఏఐ వర్సిటీ

ఆచార్య నాగార్జునలో తాత్కాలిక తరగతులు

(అంకుశం, అమరావతి, నవంబర్ 21):

ప్రపంచంలోనే తొలి క్వాంటం, ఐఏ వర్శిటీ ప్రత్యేక క్యాంపస్ శనివారం ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో తాత్కాలిక తరగతులు ప్రారంభమయ్యాయి. క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా మరో కీలక ముందడుగు పడినట్లైంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డీమ్డ్ టు బి యూనివర్సిటీ, అమరావతి తాత్కాలిక క్యాంపస్‌ను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆర్థిక సలహాదారు డాక్టర్ ఎ. ప్రతిభ ప్రారంభించారు. ఇది ప్రపంచంలోనే తొలి క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తొలి విశ్వవిద్యాలయ క్యాంపస్‌గా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మద్దతుతో అమరావతిలో నీలిట్ ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తోంది. అమరావతి క్వాంటం వ్యాలీలో నైపుణ్యాభివృద్ధికి ఈ విశ్వవిద్యాలయం కేంద్రంగా నిలవడంతో పాటు, అత్యాధునిక సాంకేతిక రంగాలకు అవసరమైన నిపుణులను తయారు చేయనుంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్వయంప్రతిపత్తి కలిగిన శాస్త్రీయ సంస్థ నీలిట్‌కు 'ఇన్‌స్టిట్యూషన్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ (డిస్టింక్ట్ కేటగిరీ)' హోదా లభించింది. కేంద్ర పరిధిలో ఉన్న ఏకైక విశ్వవిద్యాలయం ఇదే. మొదటి దశలో భాగంగా తాత్కాలిక క్యాంపస్‌లో రూ.47 కోట్ల వ్యయంతో నాలుగు అత్యాధునిక ప్రయోగశాలలను నీలిట్ ఏర్పాటు చేస్తోంది. క్వాంటం కంప్యూటింగ్ ల్యాబ్, క్వాంటం కమ్యూనికేషన్ ల్యాబ్, చిప్ డిజైన్, వీఎల్ఎస్ఐ ల్యాబ్, ఏఐ, కంప్యూటింగ్ ల్యాబ్ అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ ప్రయోగశాలల ద్వారా ప్రపంచంలోని ప్రముఖ టెక్నాలజీ సంస్థలు ఉపయోగిస్తున్న అత్యాధునిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు వినియోగించుకునే అవకాశం లభిస్తుంది. వీటి ద్వారా విద్యార్థులకు ప్రాథమిక పరిజ్ఞానంతో పాటు అధునాతన సాంకేతిక నైపుణ్యాలు, ప్రాక్టికల్ అనుభవం కల్పిస్తారు. క్వాంటం, ఏఐ, అనుబంధ సాంకేతిక రంగాల్లో నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడమే లక్ష్యంగా తాత్కాలిక క్యాంపస్‌లో వివిధ కోర్సులను వచ్చే జనవరి నుంచి ప్రారంభించనున్నారు. ఆన్‌లైన్‌తో పాటు, తరగతి గదిలోనూ శిక్షణ అందిస్తారు. రెండు నుంచి మూడు నెలల వ్యవధి కలిగిన పది అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ కోర్సులను అందించనున్నారు. వీటిలో క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం కమ్యూనికేషన్, సైన్స్, ఇంజినీరింగ్‌లో ఏఐ వినియోగం, చిప్ డిజైన్, వీఎల్ఎస్ఐ, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఐవోటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్...వీటితో పాటు ప్రాచుర్యం పొందిన లెవెల్ ప్రోగ్రామ్‌లను కూడా నిర్వహిస్తారు. అదనంగా 16 స్వల్పకాలిక కోర్సులను అందించనున్నారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా అమరావతిలో నీలిట్ శాశ్వత క్యాంపస్‌ను రూ.730.70 కోట్లతో ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి ఈ ఏడాది ఆగస్టులో ఆమోదం తెలిపారు.



ఆసియాలోనే అతి పెద్ద రిలయన్స్ పానీయాల ఫ్యాక్టరీ



అత్యాధునిక తయారీ నాకేంద్రాన్ని పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభించడం విశేషం. ఈ సాయంత్రం ఐదు గంటలకు ఓ భారీ ప్రకటన ఉంటుందన్న మంత్రి నారా లోకేశ్.. చెప్పినట్టుగానే ఈ మేరకు ప్రకటన చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో గత ఏడాది నవంబర్‌లో ఈ ప్రాజెక్టుకు భూమిపూజ జరిగింది. పనులను శరవేగంగా పూర్తి చేసుకున్న ఈ ప్రపంచ స్థాయి ప్లాంట్‌లో ఇప్పటికే కాంపా కోలా, పండ్ల రసాలు (జ్యూస్‌లు), ప్యాకేజ్డ్ తాగునీటి ఉత్పత్తి మొదలైంది. ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానానికి ఈ ప్లాంట్ అత్యుత్తమ నిదర్శనంగా నిలిచింది. తరతరాల భారతీయులకు సుపరిచితమైన స్వదేశీ బ్రాండ్ కాంపా కోలా, ఇప్పుడు రాయలసీమ గడ్డ నుంచి సరికొత్త రూపుతో పునర్జన్మ పొందింది. ఓర్వకల్లులో తయారయ్యే ఈ ఉత్పత్తులు దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారులకే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్లకు కూడా సరఫరా కానున్నాయి. ప్రపంచస్థాయి దిగ్గజ సంస్థలతో పోటీ పడేందుకు స్వదేశీ బ్రాండ్‌కు ఆంధ్రప్రదేశ్ కేంద్ర బిందువుగా మారడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా స్థానిక యువతకు విస్తృత అవకాశాలు దక్కాయి. గతంలో ఉద్యోగాల కోసం సుదూర ప్రాంతాలకు, ఇతర మెట్రో నగరాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవి. అయితే ఇప్పుడు నంద్యాలకు చెందిన మహేష్ హరి, కర్నూలుకు చెందిన ఆర్.కె. స్ఫూర్తి వంటి ఎంతో మంది స్థానిక యువతీయువకులు తమ సొంత ప్రాంతంలోనే, అంతర్జాతీయ ప్రమాణాలున్న ప్లాంట్‌లో పనిచేస్తున్నారు. రాయలసీమ యువతకు స్థానికంగానే ఉపాధి కల్పిస్తామన్న హామీ నెరవేరింది. ఈ భారీ ప్లాంట్ ద్వారా స్థానిక ప్రజలకు 1,200 ప్రత్యక్ష ఉద్యోగాలు లభించాయి. దీంతో పాటు రవాణా (లాజిస్టిక్స్), వ్యవసాయ అనుబంధ రంగాలు, ఇతర చిన్నతరహా పరిశ్రమల ద్వారా పరోక్షంగా వేలాది మందికి లబ్ధి చేకూరనుంది. రాష్ట్రంపై నమ్మకంతో పెట్టుబడులు పెట్టినందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు ధన్యవాదాలు తెలుపుతూ, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఇలాంటి పారిశ్రామిక విజయాలను విస్తరింపజేయడమే లక్ష్యంగా ప్రణాళికలు ముందుకు సాగుతున్నాయి. ఈ మేరకు నారా లోకేశ్ సోషల్ మీడియాలో వివరాలు పంచుకున్నారు.

'ఆపరేషన్ సిందూర్' వేళ పాక్‌కు చైనా రహస్య సాయం..



భారత్ ఎదుగుదలను అణచివేసే కుట్రలో భాగంగానే 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌కు చైనా సైనిక సాయం అందించిందని అమెరికా కాంగ్రెస్ కమిషన్ తన తాజా నివేదికలో కుండబద్దలు కొట్టింది. సరిహద్దుల్లో సైనిక ఒత్తిడి పెంచడం, పారిశ్రామిక సరఫరాలపై ఆంక్షలు విధించడం ద్వారా భారత్‌ను కట్టడి చేసేందుకు బీజింగ్ ప్రయత్నిస్తోందని అమెరికా-చైనా ఎకనామిక్ అండ్ సెక్యూరిటీ రివ్యూ కమిషన్ వెల్లడించింది. ఆసియాలో చైనాకు ప్రత్యామ్నాయ శక్తిగా భారత్ ఎదుగుతోందని, దీనిని అడ్డుకునేందుకే చైనా బహుముఖ వ్యూహాలను రచిస్తోందని పేర్కొంది. గత ఏడాది పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ మధ్య జరిగిన నాలుగు రోజుల ఘర్షణల్లో చైనా నేరుగా యుద్ధంలోకి దిగకుండానే పాకిస్థాన్‌ను బలోపేతం చేసిందని నివేదిక స్పష్టం చేసింది. పాక్ వాయుసేన ఉపయోగించిన జే-10సీఈ యుద్ధ విమానాల పూర్తి స్థాయి వినియోగానికి తమ ఇంజనీర్లు అక్కడే ఉండి సాంకేతిక సహకారం అందించారని చైనా స్వయంగా అంగీకరించిన విషయాన్ని కమిషన్ ప్రస్తావించింది. భారత్ మోహరింపులకు సంబంధించిన సమాచారాన్ని కూడా చైనా ఎప్పటికప్పుడు పాక్‌కు చేరవేసిందని తెలిపింది. భవిష్యత్‌లో రెండు వైపుల నుంచి ఒకేసారి ముప్పు (టూ-ఫ్రంట్ వార్) ఎదురయ్యే ప్రమాదం దీనివల్ల భారత్‌కు మరింత పెరుగుతోందని హెచ్చరించింది. మరోవైపు భారత్‌పై చైనా ఆర్థిక అస్త్రాన్ని కూడా ప్రయోగిస్తోందని నివేదిక స్పష్టం చేసింది. భారత ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని దెబ్బతీసేందుకు ముడిసరకుల ఎగుమతులను ఆపడం, తమ ఇంజనీర్లను వెనక్కి పిలిపించడం వంటి చర్యలకు దిగుతోందని తెలిపింది. భారత ఫార్మా, క్లీన్ ఎనర్జీ రంగాలు పుంజుకోకుండా చైనా తక్కువ ధరల వ్యూహాలను, బ్యాటరీ టెక్నాలజీ ఆంక్షలను అమలు చేస్తోందని విశ్లేషించింది. ఈ వ్యూహాలను దీటుగా ఎదుర్కొనేందుకు భారత్ తన రక్షణ రంగాన్ని ఆధునికీకరిస్తూనే దేశీయ తయారీకి పెద్దపీట వేస్తోందని, అమెరికా కూడా భారత్‌తో నిఘా, సముద్ర భద్రత, తయారీ రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించాలని ఈ కమిషన్ పిలుపునిచ్చింది.

తెలంగాణ టూరిజం కొత్త వన్‌డే టూర్..
పోచంపల్లికి ప్రత్యేక ప్యాకేజీ

తెలంగాణ టూరిజం శాఖ నుంచి 'ఒక రోజు పోచంపల్లిలో' టూర్
యాదాద్రి ఆలయ దర్శనంతో పాటు పోచంపల్లి సందర్శన
ఇక్కత్ చేనేత కళను ప్రత్యక్షంగా చూసే అవకాశం
పెద్దలకు రూ. 2,100, పిల్లలకు రూ. 1,680గా ధర నిర్ణయం
రేపటి నుంచి ప్యాకేజీ ప్రారంభం



రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను ప్రోత్సహించే లక్ష్యంతో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (టీజీటీడీసీ) ఒక కొత్త ప్యాకేజీని ప్రకటించింది. 'ఒక రోజు పోచంపల్లిలో' పేరుతో ఈ వన్‌డే టూర్‌ను అందుబాటులోకి తెచ్చింది. చేనేతకు ప్రసిద్ధిగాంచిన పోచంపల్లి వైభవాన్ని, ఇక్కత్ కళ నైపుణ్యాన్ని పర్యాటకులకు పరిచయం చేసేందుకు రూపొందించిన ఈ పర్యటన ఈ నెల 22వ తేదీ (ఆదివారం) నుంచి ప్రారంభం కానుంది. ఈ టూర్‌లో భాగంగా పర్యాటకులను మొదట ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ దర్శనానికి తీసుకెళ్తారు. అనంతరం, పోచంపల్లికి చేరుకుంటారు. అక్కడ తెలంగాణ టూరిజం శాఖకు చెందిన హరిత హోటల్‌లో భోజనం ఏర్పాటు చేస్తారు. స్థానిక స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన సంప్రదాయ వంటకాలను ఇక్కడ రుచి చూడవచ్చు. పోచంపల్లి ఇక్కత్ చేనేత వారసత్వాన్ని, దాని గొప్పతనాన్ని పర్యాటకులకు పరిచయం చేయడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. ఇక్కడి ఇక్కత్ మ్యూజియంలో పోచంపల్లి కళ చరిత్రను, తయారీ విధానాలను తెలుసుకోవచ్చు. అలాగే, స్థానిక నేత కార్మికులతో మాట్లాడే అవకాశం కూడా కల్పిస్తారు. దారాలకు రంగులు అద్దడం, ముడివేయడం, నేత నేయడం వంటి ప్రక్రియలను వర్క్‌షాప్ ద్వారా పర్యాటకులు ప్రత్యక్షంగా చూసే వీలుంటుంది. పర్యటన చివరలో అసలైన చేనేత వస్త్రాలను కొనుగోలు చేసేందుకు షాపింగ్ సౌకర్యం కూడా ఉంది. ఈ ప్యాకేజీలో ఏసీ బస్సులో ప్రయాణం, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఆలయ దర్శనం, ఎంట్రీ టిక్కెట్లు, నేత వర్క్‌షాప్‌లో పాల్గొనే అవకాశం ఉంటాయి. ఈ టూర్‌కు పెద్దలకు రూ. 2,100, పిల్లలకు రూ. 1,680గా ధరను నిర్ణయించారు. ఈ టూర్‌ను తెలంగాణ పర్యాటక శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలు, బుకింగ్స్ కోసం బషీర్‌బాగ్‌లోని సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం (9848540371), సికింద్రాబాద్ యాత్రి నివాస్ (9848126947), లేదా పర్యాటక భవన్ (9848306435) నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

మోదీ, షా, ఒవైసీది ఒకటే జట్టు



సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఉత్తరప్రదేశ్ నేత ఆజం ఖాన్ చేసిన 'హైదరాబాదీ బిర్యానీ' వ్యాఖ్యలను గుర్తుచేస్తూ ఒవైసీ రాజకీయాలు ఒక ప్రాంతానికే పరిమితమని పరోక్షంగా ఎద్దేవా చేశారు. తెలంగాణలో బీజేపీకి ఏమాత్రం బలం లేదని, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ మాత్రమే ప్రధాన ప్రత్యర్థి అని రేవంత్ రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ డిపాజిట్ కోల్పోయిన విషయాన్ని గుర్తుచేశారు. "నిజంగా ధైర్యం ఉంటే, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి అసదుద్దీన్ ఒవైసీని ఓడించాలి" అని సవాల్ విసిరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌పైనా రేవంత్ తన విమర్శల దాడిని కొనసాగించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను 'రావణాసురుడు'గా, కేటీఆర్‌ను 'మేనేజ్‌మెంట్ కోటా' నేతగా అభివర్ణించారు. అదే సమయంలో, లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను పెంచే ప్రతిపాదనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాబల్యం తగ్గిపోతుందని హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల్లోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయడానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

నెల్లూరు కార్పొరేషన్ చివరి సమావేశంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి కీలక వ్యాఖ్యలు

రాజకీయాల్లో వీడ్కోలు అనేది ఉండదని నెల్లూరు రూరల్ టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్పష్టం చేశారు. పదవిలో ఉన్న కార్పొరేటర్ అయినా, మాజీ కార్పొరేటర్ అయినా ప్రజాసేవలో అందరికీ సమాన భాగస్వామ్యం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నెల్లూరు నగర పాలక సంస్థ చివరి సర్వ సభ్య సమావేశం వీడ్కోలు సభగా జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజాప్రతినిధులు రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన ఆవశ్యకతను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రజలతో కలిసి నడిచేవారికి, ప్రజా సమస్యలపై పనిచేసేవారికి ఎప్పుడూ గౌరవం లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజా శ్రేయస్సు కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు. పదవీకాలం ముగిసినంత మాత్రాన ప్రజలకు దూరం కాకూడదని హితవు పలికారు.

పుట్టపర్తిలో బాబా 101వ జయంతి వేడుకలు

-మొదటిపేజీ తరువాయి

ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన భగవాన్ బాబా వారి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి కె.ఎన్. నరసయ్య,జిల్లా పర్యాటక మేనేజర్ ప్రతాప్ రెడ్డి, డి.ఆర్.డి.ఎ. సిబ్బంది, పర్యాటక శాఖ సిబ్బంది, సేవాదళ్ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గణేష్ సర్కిల్ నుండి సత్యమ్మ ఆలయం వరకు నామస్మరణ:

పుట్టపర్తిలోని గణేష్ సర్కిల్ నుండి ప్రారంభమైన ఈ దివ్య నామస్మరణ యాత్ర సత్యమ్మ ఆలయం వరకు సాగింది. భక్తులు మంగళ వాయిద్యాలు, భజనలు, కోలాటాలతో "ఓం శ్రీ సత్యసాయిరామ్" అంటూ భగవాన్ బాబా వారి దివ్య నామాన్ని స్మరిస్తూ ముందుకు సాగారు. పట్టణంలోని ప్రధాన వీధులన్నీ భక్తిభావంతో, సాయి నామస్మరణతో మారుమోగిపోయాయి. దారి పొడవునా భక్తులు పూలతో స్వాగతం పలికారు. మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని భక్తిని చాటుకున్నారు. జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ... భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారు చూపిన ప్రేమ, సేవ, మానవత్వం అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. బాబా వారి 101వ జయంతి ఉత్సవాలకు దేశ విదేశాల నుండి లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ప్రశాంతి నిలయంలో దర్శనం, వసతి, తాగునీరు, వైద్య సదుపాయం, రవాణా, పారిశుధ్యం వంటి అన్ని విషయాల్లో ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. జిల్లా పర్యాటక అధికారి కె.ఎన్. నరసయ్య మాట్లాడుతూ... భక్తుల సౌకర్యార్థం పుట్టపర్తి రైల్వే స్టేషన్, బస్టాండ్, ప్రధాన కూడళ్లలో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేశామని, ూూఖ ూ× స్కానర్ బోర్డుల ద్వారా భక్తులు తమ మొబైల్ ఫోన్ లోనే అన్ని వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ దివ్య నామ స్మరణ కార్యక్రమం భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపిందని, బాబా వారి జయంతి ఉత్సవాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.చివరగా సత్యమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హారతి నిర్వహించి, భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

చంద్రబాబు మూల్యం చెల్లించుకోక తప్పదు

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు తీవ్రస్థాయికి చేరాయని సీపీఐ నేత రామకృష్ణ ఆరోపించారు. ఏపీలో ప్రస్తుతం స్థానిక ఎన్నికల్లో విపక్షాలు కనీసం పోటీ కూడా చేయలేని పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా సాగాల్సిన ఎన్నికల్లో దౌర్జన్యం పెరిగిపోయిందని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే జరుగుతుండటంతో ఆయన రాజకీయ జీవితానికి మాయని మచ్చగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. కర్నూలులో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "అధికార పార్టీ నేతల కంటే పోలీసుల ఎక్కువ బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతున్నారు. ఈ ఎన్నికలు చంద్రబాబుకు మచ్చగా తయారయ్యాయి. దీనికి చంద్రబాబు మూల్యం చెల్లించుకోక తప్పదు. ఏపీలో ఓటు హక్కు కోసం ఎన్నికల నిర్వహణపై ప్రజలు ఉద్యమాలు చేయాలి. డబ్బులు చెల్లిస్తే ఓటు వేసే సంస్కృతిని ఈ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఎన్నికల్లో డబ్బు, దౌర్జన్యాలతో ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంగా మార్చారు" అని ఆరోపించారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణ కోసం ప్రజలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికలు ముగిసిన తర్వాత చోటుచేసుకున్న దాడులు, దౌర్జన్యాలపై సీపీఐ ఆధ్వర్యంలో మేధావులతో ప్రత్యేక చర్చా వేదికలు, సభలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తెస్తామని వెల్లడించారు.

బెంగళూరు ప్యాలెస్‌లోకి షర్మిల ప్రవేశించకుండా కోర్టును ఆశ్రయించిన జగన్!

వైఎస్ కుటుంబంలో ఆస్తుల వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. బెంగళూరులోని యలహంక ప్యాలెస్ (నివాసం)లోకి తన సోదరి వైఎస్ షర్మిల ప్రవేశించకుండా నిరోధించాలని కోరుతూ వైసీపీ అధ్యక్షుడు జగన్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ మేరకు బెంగళూరులోని దేవనహళ్లి కోర్టులో 'సిలికాన్ బిల్డర్స్ లిమిటెడ్' పేరిట భీమిశెట్టి రమేశ్ బాబు అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. గత కొంతకాలంగా యలహంక ప్యాలెస్ కేంద్రంగా వివాదం నడుస్తోంది. తొలుత షర్మిల తన కుమార్తె అంజలి రెడ్డి వివాహాన్ని యలహంక ప్యాలెస్‌లోనే నిర్వహించాలని భావించారు. అయితే, భద్రతా కారణాలను చూపుతూ జగన్ అందుకు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో షర్మిల వివాహ వేదికను మార్చుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో, తన కుమార్తె వివాహానికి జగన్‌ను స్వయంగా ఆహ్వానించేందుకు, అలాగే అక్కడ బస చేసేందుకు షర్మిల కుటుంబ సమేతంగా ఆదివారం బెంగళూరుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరిగింది. ఈ సమాచారం తెలిసిన వెంటనే జగన్ వర్గం అప్రమత్తమై న్యాయపరమైన చర్యలకు ఉపక్రమించినట్టు తెలుస్తోంది. ఈ ఆస్తిపై జగన్ తన వైఖరిని స్పష్టంగా వ్యక్తం చేస్తున్నారు. యలహంక నివాసం తన అత్తగారైన సుగుణమ్మకు చెందినదని, దీనిపై షర్మిలకు ఎటువంటి హక్కులు లేవని ఆయన స్పష్టం చేస్తున్నారు. షర్మిల నేరుగా ప్యాలెస్‌కు వస్తే భద్రతా సిబ్బందితో అడ్డుకోవడం ద్వారా అనవసర రాజకీయ దుమారం చెలరేగే అవకాశం ఉందని భావించిన జగన్, ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఉండేందుకే చట్టబద్ధంగా కోర్టు ద్వారా ఇంజంక్షన్ ఆర్డర్ కోరినట్లు తెలుస్తోంది. ఈ పిటిషన్ దాఖలు కావడంతో వైఎస్ కుటుంబ అంతర్గత విభేదాలు మరోసారి తెలుగు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ పిటిషన్‌పై కోర్టు ఏ విధమైన నిర్ణయం తీసుకుంటుందనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు..

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి ఇటీవల సొంత పార్టీపై చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. పార్టీ లైన్ దాటి మాట్లాడే నేతలపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అంశాన్ని అధిష్ఠానం చూసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, పార్టీ అంతర్గత వ్యవహారాలపై ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు.

"కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం కొంచెం ఎక్కువైంది. పార్టీ లైన్ దాటి మాట్లాడే వారిపై క్రమశిక్షణ చర్యల గురించి ఏఐసీసీ చూసుకుంటుంది. ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలను ఏఐసీసీ నిశితంగా పరిశీలిస్తోంది" అని తెలిపారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీ బలంగా ఉందంటూ చేసిన వ్యాఖ్యలు, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రభుత్వ స్థిరత్వం, పనితీరుపై మాట్లాడిన అంశాలు పార్టీలో తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో పీసీసీ చీఫ్ ఈ వివరణ ఇచ్చారు.

ఈ సందర్భంగా క్రమశిక్షణ ప్రాధాన్యతను వివరిస్తూ ఆయన గత ఉదంతాన్ని గుర్తుచేశారు. "గతంలో కొండా సురేఖ విషయంలోనూ మొదటిసారే చర్యలు తీసుకోలేదు. పలుమార్లు హెచ్చరించాం. తీరు మారకపోవడంతోనే చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. క్రమశిక్షణ ముందు అందరూ సమానమే. దేనికైనా సరైన సమయం ఉంటుంది" అని స్పష్టం చేశారు. పార్టీలో ప్రతి ఒక్కరూ నిబంధనలకు కట్టుబడి ఉండాలని, ఎవరైనా పరిధి దాటి ప్రవర్తిస్తే అధిష్ఠానం తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.

వైసీపీది విధ్వంసకర చరిత్ర

-మొదటిపేజీ తరువాయి

పిలిచారు. దీనిపై ఇంత నీచపు రాతలు అవసరమా? రాజకీయాలు, వ్యక్తిగత సంబంధాలు వేరనే కనీస అవగాహన కూడా లేదా?" అని ఆయన ప్రశ్నించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో తనకున్న స్నేహాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. "రాజశేఖరరెడ్డి, నేను మంచి స్నేహితులం. రాజకీయంగా విభేదాలు ఉన్నప్పటికీ మా వ్యక్తిగత సంబంధాలు ఎన్నడూ చెడిపోలేదు. ఆయన సీఎంగా ఉన్నప్పుడు షర్మిల, జగన్ ఇద్దరి పెళ్లిళ్లకూ నన్ను పిలిచారు, నేను హాజరయ్యాను. సంబంధాలను ఇంత దారుణంగా కించపరుస్తారా?" అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం చూసి వైసీపీ ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించడమే ఆ పార్టీ పనిగా పెట్టుకుందని విమర్శించారు.

స్వర్గీయ పరిటాల రవీంద్ర గారి విధేయులకే.

ధర్మవరం మున్సిపల్ వైస్ చైర్మన్ పీఠం.....
మున్సిపల్ వైస్ చైర్మన్ అభ్యర్థి
రేసులో తెలుగు మహిళ ముత్తుకూరు బిబి

అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 21 పరిటాల రవీంద్ర ముఖ్య అనుచరుడు నాగూర్ హుస్సేన్ కుటుంబం గత 30 సంవత్సరాలుగా పార్టీ కోసం ఎంతో సేవ చేశారు ఆస్తులను కోల్పోయారు కుటుంబాన్ని కోల్పోయి 11 సంవత్సరాల అజ్ఞాత వాసం చేసి ఎన్నో ఇబ్బందులను ఎన్నో కష్టాలను ఎదుర్కొని 2015లో ధర్మవరం కోర్టులో హాజరు కావడం జరిగినది 8 నెలల జైలు జీవితం గడిపి 2016లో బయటికి రావడం జరిగినది తరువాత పరిటాల శ్రీరామ్ గారు ధర్మవరం ఇన్చార్జిగా రావడంతో నాగూర్ హుస్సేన్ కుటుంబం పరిటాల శ్రీరామ్ నీ ధర్మవరం ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నా పట్టుదలతో కుటుంబం మొత్తం కష్టపడడం జరిగినది పార్టీ కోసం అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి వారి కుటుంబాన్ని 2022లో కూడా జైలుకు పంపిన సంఘటన లేకపోలేదు. పరిటాల శ్రీరామ్ ఆదేశాలతో అన్ని మైనారిటీ కార్యక్రమాలు విజయవంతం చేయటంలో ముందుండి పని చేశారు. అలాగే నాగూర్ ఉమర్(స్టాలిన్) గారు కూడా యువ నాయకులు పరిటాల శ్రీ రామ్ గారి కోసం ఎంతో కష్టపడడం జరిగినది ఆ కష్టాన్ని నష్టాన్ని గుర్తించే నాగూర్ హుస్సేన్ గారి సోదరి ముత్తుకూరి బీబీ కే ధర్మవరం వైస్ చైర్మన్ పదవి ఇవ్వాలన్న డిమాండు సర్వత్ర వ్యక్తం చేస్తున్నారు 42 వ వార్డు కౌన్సిలర్ గా 766 ఓట్ల అత్యధిక మెజారిటీ తో గెలుపొందారు గత 30 సంవత్సరాలు గా తెలుగుదేశం పార్టీ కి సేవలు అందించి 2001లో ఇద్దరు అన్నల్ని కోల్పోవడం జరిగినది తరువాత 2004 తన భర్తను కూడా కోల్పోవడం జరిగినది అయినా కూడా ఇలాంటి భయము లేకుండా ఇంట్లో మగదిక్కు లేకపోయినా 11 సంవత్సరాలు అటు కుటుంబాన్ని ఇటు పార్టీని వదలకుండా ముందుఉండి నడిపించడం జరిగినది



అందుకనే ముత్తుకూరు బిబి. కె ధర్మవరం మున్సిపల్ వైస్ చైర్మన్ అవకాశాలు మెండుగా ఉన్నాయని విశ్వాసనీయ వర్గాల సమాచారం

ఓటరు జాబితాలో అర్హులైన వారి పేర్ల పునరుద్ధరణకు చర్యలు

ఎస్ఐఆర్‌లో భాగంగా ఏఎస్‌డీడీ జాబితాపై ప్రత్యేక దృష్టి.. రాజకీయ పార్టీల ప్రతినిధులతో తహశీల్దార్ సమావేశం

తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 21: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు మండపేట తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. మండపేట అసెంబ్లీ నియోజకవర్గం నంబర్ 48 పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఏఎస్‌డీడీ జాబితాలో ఉన్న వారి వివరాలను మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు తీసుకుంటున్న చర్యలపై సమావేశంలో చర్చించారు. తహశీల్దార్ (ఎఫ్ఏసీ) జి. శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఎస్‌డీడీ జాబితాలోని వ్యక్తుల వివరాలను బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి పునఃపరిశీలిస్తారని, అర్హులై ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఓటర్ల పేర్లను తిరిగి ఓటరు జాబితాలో చేర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు వివరించారు. ఈ అవకాశాన్ని ఏఎస్‌డీడీ జాబితాలో ఉన్న వారందరూ సద్వినియోగం చేసుకోవాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై అర్హులైన ఓటర్లకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే సవరించిన ఎస్ఐఆర్, ఏఎస్‌డీడీ వివరాల పరిశీలన షెడ్యూల్, ఎన్నికల క్లెయిమ్‌ల స్థితిగతులు, ఇతర ఎన్నికల అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి వై. వెంకన్నబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పోటీ చేసిన అభ్యర్థి, జనరల్ ఏజెంట్, పోలింగ్ రిలీవర్ ఏజెంట్‌లను పోలింగ్ కేంద్రాల్లోకి పోలీసులు అనుమతించడం లేదని, ఈ సమస్య పరిష్కారానికి పోలీసు శాఖకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ తరఫున ఎన్.వి.ఎస్. ఫణి ప్రకాష్, జనసేన తరఫున కె. అయ్యప్ప, వైఎస్సార్‌సీపీ తరఫున వై. వెంకన్నబాబు, టీడీపీ తరఫున ఎ. సత్యనారాయణ



పాల్గొన్నారు. అధికారుల తరఫున ఎన్నికల ఉప తహశీల్దార్ పి.ఎ. మెహర్ బాబా, ఎన్నికల సీనియర్ సహాయకుడు ఎం. పద్మనాభం, మున్సిపాలిటీ టీపీఓ కె. శ్రీరమ్య, రాయవరం మండల గ్రామ సర్వేయర్ జి.ఎం. షారిమా, ఎన్నికల సమాచార నమోదు విభాగం సిబ్బంది జి. ఆంజనేయులు, జి. వెంకట్రావు పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్

క్యాన్సర్ నివారణకు గార్డాసిల్-9 టీకా
9 నుంచి 25 ఏళ్లలోపు వారికి ఉచితంగా వ్యాక్సిన్
తొలి విడతలో 2,000 డోసుల సేకరణ
టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర

అంకుశం న్యూస్ తిరుమల నవంబర్ 21 టీటీడీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఉచిత హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిల్లోమా వైరస్) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర తెలిపారు.తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవన ప్రాంగణంలోని సెంట్రల్ ఆసుపత్రిలో శనివారం ఈ కార్యక్రమాన్ని ఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పిల్లలకు అత్యాధునిక గార్డాసిల్-9 వ్యాక్సిన్‌ను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. 9 నుంచి 25 ఏళ్లలోపు వారికి ఈ టీకా వేయనున్నట్లు చెప్పారు. తొలి విడతలో 2,000 డోసులను సేకరించామని, అవసరాన్ని బట్టి మరిన్ని డోసులు అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు.
ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు వారి కుటుంబాల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అర్హులైన ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం






చేసుకోవాలని కోరారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో క్యాన్సర్ ముప్పు తగ్గింపు టీటీడీ సీఎంఓ డాక్టర్ కుసుమకుమారి మాట్లాడుతూ, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ద్వారా సర్వైకల్ క్యాన్సర్‌తో పాటు ఇతర హెచ్‌పీవీ సంబంధిత క్యాన్సర్ల ముప్పును తగ్గించవచ్చని తెలిపారు. బాలికలతో పాటు బాలురకు కూడా ఈ వ్యాక్సిన్ ప్రయోజనకరమని చెప్పారు. హెచ్‌పీవీకి చెందిన తొమ్మిది రకాల వైరస్ వేరియంట్ల నుంచి రక్షణ కల్పించడం గార్డాసిల్-9 ప్రత్యేకత అని వివరించారు. మార్కెట్ ధర కంటే తక్కువకు సేకరణ.. ఉద్యోగుల పిల్లలకు ఉచితంగా పంపిణీ గార్డాసిల్-9 వ్యాక్సిన్ ఒక్కో డోసుకు టీటీడీకి రూ.3,000 ఖర్చవుతుండగా, మార్కెట్‌లో దీని ధర సుమారు రూ.13,000 నుంచి రూ.14,000కు పైగా ఉందని అధికారులు తెలిపారు. కంపెనీ నుంచి రాయితీ ధరకు వ్యాక్సిన్లను సేకరించి, టీటీడీ నిధులతో అర్హులైన ఉద్యోగుల పిల్లలకు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. వయస్సును బట్టి వ్యాక్సిన్ డోసులు: 9 నుంచి 14 ఏళ్లలోపు వారికి: మొదటి డోసు అనంతరం ఆరు నెలలకు రెండో డోసు.15 నుంచి 25 ఏళ్లలోపు వారికి: మొదటి డోసు, రెండు నెలలకు రెండో డోసు, ఆరు నెలలకు మూడో డోసు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఆనందరాజు, వైద్యులు డాక్టర్ శివకుమార్, పారామెడికల్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో టీటీడీ ఉద్యోగులు, వారి పిల్లలు పాల్గొన్నారు.

హిందూపురంలో బాధిత బాలికను పరామర్శించిన కమిషన్ సభ్యులు చల్లా మధుసూదన్ రావు

సేవాసదనం బాలుర గృహాన్ని
సందర్శించి విద్యార్థులకు దిశానిర్దేశం

అంకుశం ప్రతినిధిహిందూపురం, నవంబర్, 21:శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని ఊటుకూరు గ్రామానికి చెందిన ఒక బాలికపై 55 ఏళ్ల మహిళ అత్యంత క్రూరంగా దాడి చేసి గాయపరిచిన అమానుష ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఈ ఘటన నేపథ్యంలో కమిషన్ గౌరవ సభ్యులు చల్లా మధుసూదన్ రావు హిందూపురంలో చికిత్స పొందుతున్న బాధిత బాలికను స్వయంగా పరామర్శించి, ఆమెకు మరియు ఆమె కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం తరపున బాధిత బాలికకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స ప్రారంభించారు. కమిషన్ సభ్యులు చల్లా మధుసూదన్ రావు బాలిక ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు, ఇప్పటివరకు అందించిన వైద్య సేవల వివరాలను వైద్యాధికారుల ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.బాధిత బాలిక శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా కోలుకునేందుకు మెరుగైన వైద్య సేవలతో పాటు, నిపుణులతో అవసరమైన మానసిక కౌన్సెలింగ్ అందించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.కేసు దర్యాప్తులో జాప్యం జరగకుండా ఉండేందుకు, బాలికకు సంబంధించిన పూర్తి స్థాయి వైద్య నివేదికలను (వీవఽఅఘ్రిశ్రీ =వజూశీతీం) అత్యంత త్వరితగతిన పోలీసు శాఖకు అందజేయాలని స్పష్టం చేశారు.ఈ ఘటనపై ఇప్పటికే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడిన నిందితులపై ఘటన తీవ్రతకు అనుగుణంగా వర్తించే అన్ని చట్టపరమైన సెక్షన్ల కింద కఠిన చర్యలు తీసుకోవాలని, దోషులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు చేయాలని పరిగి సబ్ ఇన్‌స్పెక్టర్‌ను కమిషన్ సభ్యులు ఆదేశించారు. పరామర్శ అనంతరం కమిషన్ సభ్యులు చల్లా మధుసూదన్ రావు హిందూపురంలో సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న 'సేవాసదనం బాలుర గృహాన్ని' సందర్శించారు. అక్కడి వసతులను పరిశీలించి, విద్యార్థులతో కొంత సమయం ఆప్యాయంగా ముచ్చటించారు. జీవితంలో విద్యకున్న ప్రాముఖ్యతను వివరిస్తూ.. ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని పిల్లలకు దిశానిర్దేశం చేశారు. బాలల హక్కుల పరిరక్షణ, వారి



భద్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదని కమిషన్ సభ్యులు పేర్కొన్నారు. బాధిత బాలలకు సకాలంలో అవసరమైన వైద్య, మానసిక, న్యాయ మరియు సామాజిక సహాయాన్ని అందించడంలో సంబంధిత ప్రభుత్వ శాఖలన్నీ పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా బాలల పరిరక్షణ అధికారి మహేష్, అనంతపురం జిల్లా బాలల పరిరక్షణ అధికారి మంజునాథ్, సీడీపీఓలు శాంతలక్ష్మి, వరలక్ష్మి, ఆర్డీటీ ప్రతినిధి ఆదినారాయణ, బాలల సంక్షేమ సమితి సభ్యులు రామన్న, ప్రొటెక్షన్ అధికారులు నాగలక్ష్మి,మురళీధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

బెంగుళూరు వేదపండితులచే జి.బి.ఆర్ కాలేజీ ప్రాంగణంలో మహారుద్రాభిషేకం





తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 21: కార్తీక మాసం సందర్భంగా అనపర్తి గ్రామ శ్రేయస్సు మరియు విద్యా సంస్థల శ్రేయస్సు కొరకు జి.బి.ఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో బెంగుళూరు 'ది ఆర్ట్ ఆఫ్ లివింగ్' – వైదిక ధర్మసంస్థ శ్రీశ్రీశ్రీ రవిశంకర గురూజీ శిష్యులు శ్రీ దండు శ్రీనివాసరావు మరియు వేదపండితుల ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలనుండి 8 గంటల వరకు మహారుద్రాభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరిగింది. అత్యంత విశిష్టమైన ఈ మహారుద్రాభిషేకం వలన అందరికీ మహాశివుని అనుగ్రహం కలిగి ఆయురారోగ్య ఐశ్వర్యప్రాప్తి కలగాలని జి.బి.ఆర్ విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంటు శ్రీ తేతలి ఆదిరెడ్డి (కొండబాబు) ఆకాంక్షించారు. ఈ పూజాకార్యక్రమంలో జి.బి.ఆర్ పీజీ కోర్సెస్ డైరెక్టరు శ్రీ బి.రత్నారెడ్డి,డిగ్రీ కాలేజ్ డైరెక్టరు శ్రీ హరినాథ రెడ్డి,డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీ ఎన్ .పెద్ద అబ్బాయి రెడ్డి,జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీ పి.ఆర్.ఎల్ స్వామి, గేమ్స్ డైరెక్టర్ మహేంద్ర రెడ్డి, బీఈడీ ఇన్చార్జి సాంబశివరావు, ఐ.ఎం. ఏ. టీమ్ జి.సత్తిరెడ్డి, జి.బి.ఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డీన్ జి.హరిప్రసాద్,హైస్కూల్ హెచ్.ఎం.రామారావు,ప్రైమరీ హెచ్.ఎం. భువనేశ్వరి, ఏసి క్యాంపస్ ప్రిన్సిపాల్ టి.బుచ్చిరాజు, ఇంఛార్జులు శ్రీవెంకటరెడ్డి, వెంకటరెడ్డి, అకడమిక్ కో-ఆర్డినేటర్ ప్రశాంతిరెడ్డి, ఏవో ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం లో పరిటాల శ్రీరామ్ కు గజమాల సత్కారం!

ధర్మవరం రికార్డ్!!!



అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 21 ధర్మవరం నియోజకవర్గం టీడీపీ కంచుకోట పై పరిటాల అభిమానుల ఆశలు నిజమయ్యాయి. నియోజకవర్గం ఇంచార్జి గా వున్న టీడీపీ యువ నేత పరిటాల శ్రీ రామ్ కు శ్రీ సత్య సాయి జిల్లా జడ్ పి చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేయడం పట్ల పలువురు పరిటాల అభిమానులు ఆయన పట్ల అభిమానం తో టీడీపీ శ్రేణులు తెలుగు మహిళలు పరిటాల అభిమానులతో భారీ ర్యాలీ లో పాల్గొని అందరినీ ఉత్సాహ పరిచారు. జై జై పరిటాల శ్రీరామ్ అంటూ ధర్మవరం టీడీపీ కంచుకోట లో తెలుగుదేశం శ్రేణులు బాణా సంచా కాల్చి కేరింతలు కొట్టారు తనపై ఇంత అభిమానం తో భారీ ర్యాలీ లో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ టీడీపీ యువనేత జిల్లా జడ్ పి చైర్మన్ పరిటాల శ్రీ రామ్ కృతజ్ఞతలు తెలియజేసారు.

జిల్లా పరిషత్ పాఠశాలలో పోక్సో చట్టంపై జూనియర్ సివిల్ జడ్జి ఎం.వంశీ కృష్ణ అవగాహన సదస్సు



తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 21: అనపర్తి జూనియర్ సివిల్ కోర్టు ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు లో భాగంగా పోక్సో చట్టం గురించి అవగాహన కార్యక్రమం పందలపాక గ్రామం లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జరిగింది. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఎం.వంశీ కృష్ణ,బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాసరెడ్డి, సెక్రటరీ.టీ.వి.వి రమణమూర్తి, న్యాయవాదులు నల్లమిల్లి వినూరెడ్డి,చక్రవర్తి,వెలగల లక్ష్మీనారాయణరెడ్డి,సబ్బెళ్ల లక్ష్మి ,శ్రీకాంత్ రెడ్డి మరియు స్కూల్ ఎచ్ ఎం.చిర్ల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా అనంతనేని లక్ష్మీనరసమ్మ

రాప్తాడు, అంకుశం న్యూస్ నవంబరు 21 గ్రామ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక చొరవ చూపుతానని తెలుగుదేశం పార్టీ జి. కొత్తపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి అనంతనేని లక్ష్మీనరసమ్మ తెలిపారు. శనివారం రాప్తాడు మండల పరిధిలోని జి.కొత్తపల్లి గ్రామం నందు టిడిపి గ్రామ సర్పంచ్ అభ్యర్థి అనంతనేని లక్ష్మీనరసమ్మ మరియు భర్త అనంతనేని ఏర్రి స్వామి కుటుంబ సభ్యులు గ్రామంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు.ఈ శుభ సంధర్భంగా గ్రామ ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. గ్రామ అభివృద్ధి సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఎన్నికల ప్రచారం చేసినట్లు తెలిపారు.గ్రామ ప్రజలు తనకు ఒక్క అవకాశం కల్పించి ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ వీధి దీపాల ఏర్పాటు ఆధునిక అభివృద్ధి డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో అనంతనేని సంజయ్ దత్ కిరణ్ కుమార్ కుటుంబ

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు మాంటిస్సోరి విద్యార్థుల ఎంపిక

రాప్తాడు అంకుశం న్యూస్ నవంబర్ 21 మండలంలోని గొల్లపల్లి సమీపంలో ఉన్న మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. అనంతపురంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-17 బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీల్లో ఈ పాఠశాలకు చెందిన బద్రీనాథ్, సుస్మిత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ నెల 19 నుండి 21 వరకు కర్నూలు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఎండీ కృష్ణ భరత్, కరస్పాండెంట్ కృష్ణ సమీర, ప్రిన్సిపల్ ప్రతాప్ రెడ్డి ఎంపికైన విద్యార్థులతో పాటు బాస్కెట్‌బాల్ కోచ్‌లు ప్రసాద్, అఖిలను ప్రత్యేకంగా అభినందించారు.



గ్రామ పంచాయతీ ఎన్నికలు సందర్భంగా నామినేషన్ కేంద్రాల వద్ద ప్రతిష్టమైన భద్రతా ఏర్పాట్లు...



అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 21 జిల్లా ఎస్పీ శ్రీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ ఎన్నికల మూడవ దశ నామినేషన్ల నేపథ్యంలో నామినేషన్ కేంద్రాల పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన పోలీసు అధికారులు సిబ్బందికి సూచించారు. నామినేషన్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం నిఘా ఉంచాలని, ఎన్నికల విధుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సిబ్బందికి ఆదేశించారు.

రాష్ట్ర స్థాయి బాలికల హాకీ క్రీడల పోటీలో ప్రతిభ చూపిన గొట్లూరు విద్యార్థిని కుమారి శ్రీ తేజ..

అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 21 పులివెందులలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 బాలికల హాకీ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి, ఆంధ్ర జట్టుకు ఎంపికైన ధర్మవరం మండలం గొట్లూరుకు చెందిన విద్యార్థిని కుమారి తేజశ్రీకి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ గారు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ ప్రాంతానికి గర్వకారణంగా నిలిచిన తేజశ్రీ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంత్రి గారు ఆకాంక్షించారు.



సత్య సాయి బాబా జయంతి సందర్భంగా శ్రీ చౌడేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం


అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 21 పుట్టపర్తి శ్రీ సత్య సాయి బాబా జయంతి ఉత్సవాలు సందర్భంగా చౌడేశ్వరి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం ఎంతో విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి, ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడేందుకు తమ వంతు సహకారం అందించడం అభినందనీయం. ఈ సందర్భంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రంతో పాటు మెమెంటో అందించి ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధర్మవరం తొగటవీర క్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీరాములు గారు మరియు గొడుగు .నాగరాజు గారు పాల్గొని రక్తదాతలను అభినందించి, రక్తదానం యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. ఒకరు చేసే రక్తదానం మరొకరి కుటుంబంలో వెలుగులు నింపుతుంది. సమాజ సేవలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషకరం. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ముఖ్య అతిథులకు, రక్తదాతలకు, సేవా సమితి సభ్యులకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.మనిషికి మనిషి చేసే గొప్ప సహాయం ప్రాణదానం. రక్తదానం చేద్దాం... ప్రాణదాతలుగా నిలుద్దాం!అని నిర్వాహకులు బీరే శ్రీ రాములు పేర్కొన్నారు.



రాప్తాడు మండలంలో సర్పంచ్ ఎన్నికల బరిలో 42 మంది అభ్యర్థులు

- ఎంపీడీవో విజయలక్ష్మి

రాప్తాడు అంకుశం న్యూస్ నవంబర్ 21 మండలంలోని గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ఎంపీడీవో బి.విజయలక్ష్మి శనివారం వెల్లడించారు. మండలంలోని మొత్తం 16 గ్రామ పంచాయతీలకు గాను ఏ ఒక్క పంచాయతీ కూడా ఏకగ్రీవం కాలేదని, అన్ని స్థానాలకు పోలింగ్ జరగనున్నాయని తెలిపారు. ?మొత్తం 16 పంచాయతీల సర్పంచ్ పదవుల కోసం 42 మంది అభ్యర్థులు తుది బరిలో నిలిచారు. అత్యధికంగా రాప్తాడు పంచాయతీలో 5 మంది, హంపాపురంలో 4 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇక గొల్లపల్లి, గొందిరెడ్డిపల్లి, జి.కొత్తపల్లి, ప్రసన్నాయపల్లి, పుల్లలరేవు పంచాయతీల్లో 3 గురు చొప్పున, బండమీదపల్లి, భోగినేపల్లి, బొమ్మేపర్తి, బుక్కచెర్ల, చెర్లోపల్లి, గాండ్లపర్తి, మరూరు, పాలచెర్ల, ఎర్రగుంట్ల పంచాయతీల్లో ఇద్దరు చొప్పున అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అన్ని పంచాయతీల్లో ఈనెల 26వ తేదీన పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



పంచాయతీ పోరులోనూ విజయం దేశం పార్టీ దే

ఎమ్మెల్యే పరిటాల సునీత, జడ్పీ ఛైర్మన్ పరిటాల శ్రీరామ్

అంకుశం న్యూస్ అనంతపురం నవంబర్ 21 2024ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధిస్తే ఈవీఎంలంటూ విమర్శలు చేశారని.. ఇప్పుడు బ్యాలెట్ ద్వారా కూడా వైసీపీకి గట్టి దెబ్బ కొట్టారని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, సత్యసాయి జిల్లా జడ్పీ చైర్మన్, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. రామగిరి మండలం వెంకటాపురంలోని తమ నివాసంలో వారు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం సాధించిన చారిత్రక విజయాలు, రెండున్నరేళ్ల సుపరిపాలన, సామాజిక న్యాయం, గ్రామ పంచాయతీ ఎన్నికల గురించి వివరించారు. ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా కూటమిని అఖండ మెజారిటీతో గెలిపించిన ప్రజలు, ఇటీవల జరిగిన కార్పొరేషన్, మున్సిపాలిటీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ బ్యాలెట్ల ద్వారా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు పట్టం కట్టారని అన్నారు. గత వైసీపీ హయాంలో రిగ్గింగ్‌లు, దాడులు, దౌర్జన్యాలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని మండిపడ్డారు. నేడు కూటమి ప్రభుత్వంలో అత్యంత ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరుగుతున్నాయని, 40ఏళ్ల తర్వాత పులివెందుల ప్రజలు సైతం తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ముఖ్యంగా రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సాధించిన ఏకపక్ష విజయాలు ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు స్వచ్ఛందంగా కూటమికి అండగా నిలిచారని, రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ రాప్తాడులో ప్రతి పంచాయతీని క్లీన్ స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు తగ్గించడం వల్ల దాదాపు 16,800 మంది బీసీ నాయకులు రాజకీయ ప్రాతినిధ్యం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేస్తే వైసీపీ నేతలు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారని, అయినప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి పార్టీ పరంగా 40 శాతం రిజర్వేషన్లు కల్పించి బడుగు, బలహీన వర్గాలకు సముచిత ప్రాధాన్యం ఇచ్చామని స్పష్టం చేశారు. జడ్పీ చైర్మన్ శ్రీరామ్ మాట్లాడుతూ.. ధర్మవరం నియోజకవర్గంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు రికార్డు స్థాయి మెజారిటీతో చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడం, అలాగే ధర్మవరం నియోజకవర్గంలో నాలుగు ఎంపీపీ స్థానాలు కైవశం చేసుకోవడంతో పాటు ధర్మవరం రూరల్, బత్తలపల్లి మండలాల్లో సాధించిన జడ్పీటీసీ విజయాలు క్యాడర్ సమష్టి కృషికి నిదర్శనమన్నారు. పార్టీ అధిష్టానం, జిల్లా ప్రజా ప్రతినిధుల సంపూర్ణ సహకారంతో శ్రీ సత్యసాయి జిల్లా ప్రథమ జడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం తనపై మరింత జిల్లాలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలు కలిసి పనిచేసే 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్' ద్వారానే సంక్షేమ పథకాలు అట్టడుగు స్థాయికి చేరుతాయన్నారు. అలా ఉంటేనే అభివృద్ధి పరుగులు పెడుతుందని అన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఒకే ప్రభుత్వం ఉంటే నిధుల కేటాయింపు, మౌలిక వసతుల కల్పన వేగంగా జరుగుతుందని వివరించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు, సమాన అవకాశాలు అందించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన పీ4 విధానం సత్ఫలితాలను ఇస్తోందని తెలిపారు.



ఇటీవల సంభవించిన రెండు భారీ తుఫానులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రభుత్వ యంత్రాంగం తుఫాను కంటే వేగంగా స్పందించి సమర్థవంతంగా ఎదుర్కొందన్నారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఎల్ నినో తీవ్రత ఉన్నా సమర్థ సాగునీటి యాజమాన్యంతో రైతులను ఆదుకున్నామన్నారు. మేయర్లు, మున్సిల్ చైర్‌పర్సన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానాన్ని ప్రవేశపెట్టి ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేశామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఇదే ఐక్యత, సమన్వయంతో పనిచేసి రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల పరిధిలోని ప్రతి గ్రామాన్ని ప్రగతి బాటలో నడిపించేందుకు తాము ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటామని పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు.

సోమలాపురంలో మంచం గుర్తు ప్రచార జోరు..
మొండి గీతకు మద్దతుగా గ్రామమంతా విస్తృత ప్రచారం

జనతా కాలనీ నుంచి అంబేద్కర్ కాలనీ వరకు ప్రచారం..
ఉత్సాహంగా పాల్గొన్న టీడీపీ, జనసేన నాయకులు, మహిళలు, యువకులు

డి.హీరేహాల్ నవంబర్ 21, అంకుశం న్యూస్ : సోమలాపురం గ్రామంలో సర్పంచ్ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. సర్పంచ్ అభ్యర్థి మొండి గీతకు మద్దతుగా మంచం గుర్తుపై గ్రామవ్యాప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీల్లో నాయకులు, కార్యకర్తలు పర్యటిస్తూ అభ్యర్థికి మద్దతుగా ఓటర్లను కలిసి ప్రచారం చేపట్టారు. జనతా కాలనీ, బస్టాండ్ ప్రాంతం, అంబేద్కర్ కాలనీ, వికలాంగుల కాలనీతో పాటు ఈశ్వరుని ఆలయం సమీపంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచం గుర్తు మొదటి నంబర్‌లో ఉందని వివరిస్తూ, తమ అమూల్యమైన ఓటును మంచం గుర్తుకు వేసి మొండి గీతను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు కూడా విజ్ఞప్తి చేస్తూ ప్రచారాన్ని విస్తృతంగా కొనసాగించారు. ఈ ప్రచార కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థి మొండి గీతా మల్లికార్జున, టీడీపీ సీనియర్ నాయకుడు అంగడి రాజశేఖర్, శంకర్, మాజీ ఎంపీటీసీ భీమలింగ, సురేష్, రవి, బసవరాజు, అశోక్, పరశురామ్, దుర్గేష్, జనసేన నాయకులు అలివేలు, శ్రీరాములు, పోస్ట్ నాగరాజు, బోయ నాగరాజు, నాగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు సైతం ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొని అభ్యర్థికి మద్దతుగా ప్రజలను కలిశారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో కొనసాగిన ఈ ప్రచార కార్యక్రమం ఎన్నికల వాతావరణాన్ని మరింత వేడెక్కించింది. గ్రామాభివృద్ధిని ఆకాంక్షిస్తూ మొండి గీతకు మద్దతు ఇవ్వాలని నాయకులు, కార్యకర్తలు ఓటర్లను కోరారు.



ఎమర్జెన్సీ వార్డులో వీల్ చైర్లు లేని దుస్థితి పట్టించుకోని అధికారులు....


అంకుశం న్యూస్, అనంతపురము, నవంబర్:21 అత్యవసర వైద్య విభాగంలో వీల్ చైర్ స్ట్రక్చర్ కూడా లేకపోవడంతో ఇలా ఎత్తుకొని వెళ్లాల్సిన దౌర్భాగ్యం అధికారులు ఉన్న తమ ఏసీ గదులలో చేద తీరుతున్నారు ఉత్తుత్తి వీల్ చైర్ బ్యాంకు ఏర్పాటు చేసి అధికారులకు అమ్ముకునేందుకు ఆర్థిక వనరులను కల్పించారు కార్పొరేషన్ ఎన్నికలలో ఎయిర్పోర్ట్ బుల్లెట్ ట్రైన్ అందిస్తామన్నారు.ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వీల్ చైర్లు లేవు.రోగులకు కనీస సౌకర్యాలు కల్పించండి అది చాలు.



భక్తిశ్రద్ధలతో టీటీడీ ముద్రణాలయంలో ఘనంగా ఆయుధ పూజ

అంకుశం న్యూస్ తిరుపతి నవంబర్ 21 తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం ఎదురుగా ఉన్న ముద్రణాలయంలో శనివారం ఆయుధ పూజ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా శ్రీవారి విగ్రహానికి పూలమాలలు సమర్పించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ముద్రణాలయాన్ని అందంగా అలంకరించి, అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ యంత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముద్రణాలయంలోని డీటీపీ, ఆఫ్‌సెట్, మిషన్, ఆర్టిస్టు, బైండింగ్ విభాగాల్లోని యంత్రాలకు ఆయుధ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముద్రణాలయ డిప్యూటీ ఈవో శ్రీ విజయ్ కుమార్, పీఆర్వో (ఎఫ్ఏసీ) కుమారి పి. నీలిమ, యూనియన్ నాయకులు శ్రీ ఎన్. శ్రీనివాసన్, వి.కె. శ్రీనివాసులు, శ్రీనివాసమూర్తి, భాస్కర్, శ్రీమతి శ్రీదేవి, వివిధ విభాగాల సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

తాడిపత్రి ఎమ్మెల్యే జెసి.అస్మిత్ రెడ్డి, మాజీ ఎంపీ జెసి.దివాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జెసి.ప్రభాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జడ్పీ చైర్మన్ గంజి నాగరాజు.



అంకుశం న్యూస్, తాడిపత్రి, నవంబర్:21 నూతనంగా అనంతపురం జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికైన గార్లదిన్నె జడ్పీటీసీ సభ్యులు గంజే నాగరాజు తాడిపత్రి పట్టణంలోని నివాసంలో తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ని, మాజీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి ని, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి, తన ఎన్నికకు సహకరించి ప్రోత్సహించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా ఏ డి సి సి బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి పాల్గొన్నారు.